ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
చిత్తూరు జిల్లా వార్తలు
గురువారం 27 జూన్ 2024


ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి బారులు తీరిన జనం

- మాటల్లో స్పష్టత.. సంకల్పంలో ధీరత
- కేడర్‌కు దిశానిర్దేశం
- అధికార యంత్రాంగానికి అభివృద్ధి ఆదేశం
- ప్రజలకు బంగారు భవిష్యత్తు సందేశం
- సరికొత్త చంద్రబాబును చూస్తారని హామీ
- ముగిసిన రెండు రోజుల కుప్పం పర్యటన

అప్డేట్ 'బాబు'


నా మాట వినండి. చెప్పింది చేయండి. మీ భవిష్యత్తు బంగారుమయం చేసే పూచీ నాది.
- ఐదేళ్ల వైసీపీ విధ్వంసంలో ప్రజలు ఎందుకూ కాకుండా పోయారన్న ఆవేదన.

'షో చేయడంవల్లే ఇంత దీనస్థితి. నేను, ప్రజలు అంతా బాగనే ఉన్నాం. మీరే బాగలేదు. ఇక మీదట ఇలాంటి తీరు సహించేది లేదు.
- మెజారిటీ రావాల్సినంత రానందుకు ముఖ్య స్థానాల్లో ఉన్న పార్టీ కేడర్‌పై ఆగ్రహం.

ఐదేళ్లలో మీలో కొంతమంది అధికారులు ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. ఇక అటువంటి ఆటలు చెల్లవు. సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుని రండి.
- అధికార యంత్రాంగంపై అసహనంతోపాటు జరగాల్సిన అభివృద్ధిపై ఆదేశం.

అవును.. 'బాబు' అప్డేట్ అయ్యారు. ఆ మాట ఆయనే స్వయంగా అన్నారు. 'పాత రాజకీయం ఇక పనిచేయదు. ఆ రాజకీయాలను మార్చాలి. నేను కూడా మారాలి. మారతాను' అని పార్టీ శ్రేణుల సమావేశంలో స్పష్టం చేశారు. ఆయన మారిన తీరుకు కుప్పం నియోజకవర్గంలో మంగళ, బుధవారాల్లో జరిగిన పర్యటనే తక్షణ నిదర్శనం. - కుప్పం


కార్యకర్తల సమావేశంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చంద్రబాబు


కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద నాయకులు, కార్యకర్తల సందడి

హెచ్చరించి.. బుజ్జగించి

పార్టీ కేడర్‌తోనూ చంద్రబాబు సమావేశాలు వినూత్న రీతిలో సాగాయి. మంగళవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం... బుధవారం మధ్యాహ్నం జరిగిన వివిధ స్థాయిలలోని బూత్ స్థాయిదాకా ఉన్న కమిటీలు, ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశంలోనూ ఇది కనిపించింది. ఎన్నికల్లో తన మెజారిటీ ఏమాత్రం పెరగకపోవడంపైనే చంద్రబాబు పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. ఎక్కడెక్కడో అత్యధికంగా మెజారిటీలు వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, స్వయంగా తన సొంత నియోజకవర్గంలో ఎందుకు రాబట్టలేకపోయారని, పార్టీ కేడర్ సమావేశంలో బాధ్యులను నిలదీశారు. గతంలో నలుగురైదుగురు సీనియర్లను మాత్రమే చేరదీసి వారు చెప్పిన విషయాలే ఆలకించి వెళ్లిపోయే బాబు, ఈసారి మాత్రం ఎన్నికల్లో ఏమాత్రం ఉపయోగపడలేకపోయిన అటువంటి కోటరీని పూర్తిగా పక్కన పెట్టారు. పైగా పిలవనిదే స్టేజీ ఎక్కి షో చేస్తున్నారంటూ మండిపడి, కింది స్థాయి కార్యకర్తలు, యువ కేడర్‌లో హుషారు పుట్టించారు. కష్టపడేవారి భవిష్యత్తుకు ఢోకా లేదని చాలా స్పష్టంగా చెప్పడమే కాకుండా, కేవలం సీనియారిటీ ఇకమీదట పనిచేయదని, షో చేసేవాళ్లను ప్రోత్సహించేది లేదని కేడర్‌కు స్పష్టంగా తెలియజెప్పగలిగారు.

జన నీరాజనం

నాలుగోసారి ముఖ్యమంత్రిగా అధికార పీఠం అధిష్ఠించిన తర్వాత తొలిసారిగా సొంత నియోజకవర్గంలో అడుగు పెట్టిన చంద్రబాబుకు ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. నిజానికి ఆయన శైలికి భిన్నంగా బస్సు దిగి కిందికి రాకపోయినా, దారి పొడవునా గజ మాలలు, పూల వర్షాలతో సత్కరించి తమ గుండెల్లోని అభిమానం చాటుకుంది. మహిళలు మంగళ హారతులిచ్చి దిష్టి తీశారు. చిరునవ్వులతో తమ ఆనందాతిరేకాలను ప్రదర్శించారు. ఇటు ఆర్టీసీ బస్టాండులో జరిగిన సభలో జనం కానీ, ఇటు పార్టీ సమావేశాల్లో కేడర్ కానీ చంద్రబాబు ప్రసంగానికి ఈలలు, కేకలు వేస్తూ ఆయనలో వచ్చిన మార్పుపట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

టైమ్ ప్రకారం షెడ్యూల్

అన్నింటికంటే అందరినీ ఆశ్చర్యం కలిగించిన సంఘటన.. రెండు రోజుల చంద్రబాబు పర్యటన షెడ్యూల్ టైమ్ ప్రకారం సాగడం. మంగళవారం ఉదయం షెడ్యూల్ సమయం కంటే కేవలం అరగంట ఆలస్యంగా పీఈఎస్ హెలిప్యాడ్‌కు చేరుకున్న ఆయన, బుధవారం సాయంత్రం చెప్పిన సమయమైన సాయంత్రం 4.10 గంటలకు అదే హెలిప్యాడ్ నుంచి వీడ్కోలు తీసుకున్నారు. చెప్పిన షెడ్యూల్ మించి, ఒక్కటంటే ఒక్క ఇతర సమావేశాల్లో పాల్గొనడం కానీ, ముందుగా ప్రకటించని ప్రాంతాలకు వెళ్లడం కానీ చేయలేదు. దీంతో ఇటు పార్టీ కేడర్‌తోపాటు అటు అధికార యంత్రాంగం కూడా పూర్తిగా ఖుషీ అయింది.

అభివృద్ధే ఏకైక లక్ష్యంగా..

ముఖ్యమంత్రిగా తొలిసారి కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబు బుధవారం అధికార యంత్రాంగంతో సుదీర్ఘ సమీక్ష జరిపిన తీరు ఆయనలో వచ్చిన మార్పునకు సంకేతం. మంగళవారం కుప్పం సభలో ప్రజలకు హామీ ఇచ్చిన ప్రతి అభివృద్ధి పని గురించీ చంద్రబాబు సమీక్ష చేశారు. గత పాలనకు, తన పాలనకూ మధ్య మార్పు స్పష్టంగా కనిపించి తీరాలన్నారు. ప్రతి శాఖకు సంబంధించి స్పష్టమైన సమగ్రాభివృద్ధి ప్రణాళికలతో సాధ్యమైనంత త్వరలో తన దగ్గరకు రావాలని ఆదేశించారు. ప్రత్యేకించి నియోజకవర్గ అభివృద్ధిపైనే దృష్టి పెట్టారు. గతంలో కంటే ఇది భిన్నమైన తీరు. ఇక్కడికిక్కడే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం, అధికార యంత్రాంగంలోనూ చురుకుదనం పుట్టించే చర్యే. ఇది చంద్రబాబుపై ప్రజల్లో పూర్తిస్థాయిలో నమ్మకం ఏర్పడడానికి దోహదం చేస్తుంది కూడా.

బంగారు భవిత

హంద్రీ-నీవా కాలువ పెండింగు పనులు పూర్తి, అవుటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం, కోల్డ్ స్టోరేజీ, ఆర్ అండ్ బీ భవనం పూర్తి, ఇన్నాళ్లూ మూలన పడ్డ వ్యవసాయ, పట్టు, పాడి, టెక్స్‌టైల్స్ పరిశ్రమల అభివృద్ధికి ప్రణాళికలు, మండల కేంద్రాల అభివృద్ధికి ఒక్కోదానికీ రూ.10 కోట్లు, పంచాయతీల అభివృద్ధికి రూ.కోటి నుంచి రూ.2 కోట్లు, అదనంగా రాళ్లబూదుగూరు, మల్లానూరును మండలాలు చేయడం.. ఇలా నియోజకవర్గ ప్రజలపైన వరాల జల్లు కురిపించారు. 'నేను మీ బాగుకోరే వాడిని. ఇంతకుముందు ఎంతో చేశాను. ఇకమీదటా చేస్తాను. కానీ మీరు కేవలం 48 వేల మెజారిటీ ఇచ్చారు' అని ఆవేదనా వ్యక్తం చేశారు. అలాగని అభివృద్ధి ఆగదని, వచ్చే ఐదేళ్లలో కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా చేస్తానని హామీ ఇచ్చారు.

కుప్పం నుంచే పేదరిక నిర్మూలన

- సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి
- రౌడీయిజం, గంజాయి కనిపించకూడదు
- అధికారుల సమీక్షలో సీఎం చంద్రబాబు

కుప్పం, జూన్ 26: 'సింపుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ నా విధానం. పేదరిక నిర్మూలనకు కుప్పం నుంచే శ్రీకారం చుడతా. దీంతోపాటు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికీ అవసరమైన ప్రణాళికలను తయారు చేయండి' అని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. కుప్పంలోని డిగ్రీ కళాశాలలో బుధవారం ఆయన జిల్లా, నియోజకవర్గ అధికారులతో అభివృద్ధిపై సమీక్షించారు. అధికారులు ఫిజికల్, వర్చువల్ పనివిధానాలకు సిద్ధపడాలని సూచించారు. ప్రజోపయోగ కార్యక్రమాలు, పథకాల అమలుకోసం అధికారులు సాధ్యమైనంత వేగంగా స్పందించి ఆయా పనులను కార్యరూపంలో పెట్టాలన్నారు. తమ ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆలోచనలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 'కుప్పంలో ఇక రౌడీయిజం కనిపించకూడదు. గంజాయి స్మగ్లింగ్, పెంపకం, దొంగ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు ఆగిపోవాలి. రాజకీయ ప్రోద్బలంతో పెట్టిన తప్పుడు కేసులు, తప్పుడు రౌడీషీట్లు ఎత్తేయండి' అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గత ఐదేళ్లలో కొందరు అధికారుల పనితీరు పట్ల చంద్రబాబు అసహనం వ్యక్తంచేశారు. గత తప్పిదాలను ఎత్తిచూపారు. అలాంటి వాళ్లంతా తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. '2019 వరకు నాపై ఒక్క కేసు కూడా లేదు. అలాంటిది ఈ ఐదేళ్లలో నాపైనా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అనేక అక్రమ కేసులు పెట్టారు. ప్రభుత్వ వ్యవస్థలు నాశనం కావడం నాకు చాలా బాధ కలిగించింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'జిల్లాలోను, కుప్పంలోను మళ్లీ ప్రశాంత వాతావరణం నెలకొనాలి. అందుకు ఇప్పటినుంచే సక్రమమార్గంలో వేగంగా పనిచేయడం ప్రారంభించాలి' అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.


అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

నియోజకవర్గంలో మార్పు కనిపించాలి

కుప్పం నియోజకవర్గంలో కొన్ని సమస్యలు సవాళ్లు విసురుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా ఇంటింటికీ శుద్ధ జలాన్ని అందించే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్‌కు సంబంధించి పెండింగు పనుల పూర్తికి ప్రణాళిక రూపొందించాలన్నారు. పాడి, పట్టు, తేనె ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. పండ్లు, కూరగాయలకు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెస్తామని, అందుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. రైతులకు సబ్సిడీలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, ఇతర జిల్లా, నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో
45 శాతం ఉత్తీర్ణత


చిత్తూరు (సెంట్రల్), జూన్ 26: ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫెయిలైన వారితో పాటు బెటర్‌మెంట్‌కు మే నెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. ఈ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. 5,817 మంది విద్యార్థులకు గాను 2,597 మంది (45 శాతం) ఉత్తీర్ణత సాధించగా, 3,220 మంది ఫెయిలయ్యారు. ఒకేషనల్‌లో జిల్లా 20వ స్థానంలో నిలిచింది. 814 మందికి గాను 368 మంది (45 శాతం) ఉత్తీర్ణత సాధించగా, 446 మంది ఫెయిలయ్యారు. కాగా, ఈనెల 28 నుంచి జూలై 4వ తేదీ వరకు విద్యార్థులు వెయ్యి రూపాయలు చెల్లించి రీవెరిఫికేషన్ చేయించుకునేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అవకాశం కల్పించింది. జూలై ఒకటి నుంచి మార్కుల మెమోలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీలో 79 శాతం

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లాలో 79 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గత నెల 24 నుంచి జూన్ 10వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించగా, ఆరు నుంచి 9వ తేదీ వరకు మూల్యాంకనం చేపట్టారు. జిల్లాలో 1,966 మంది పరీక్షలు రాయగా, 1,550 మంది (78.84 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 1,306 మంది బాలురకు గాను 1,015 మంది (77.72 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 660 మంది బాలికలకు గాను 535 మంది (81.06 శాతం) ఉత్తీర్ణత సాధించారు. కాగా గురువారం నుంచి జూలై 1వ తేదీ వరకు విద్యార్థులు రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

చాకలికోన, నెమలిగుట్టల్లో
ఏనుగుల తిష్ట

- డ్రోన్ సాయంతో గుర్తించిన అటవీశాఖ


చాకలికోనలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు


డ్రోన్ సాయంతో ఏనుగులను గుర్తిస్తున్న అటవీ అధికారులు

కల్లూరు, జూన్ 26: పులిచెర్ల మండలం చాకలికోన, నెమలిగుట్ట ప్రాంతాల్లో ఏనుగులు తిష్టవేశాయి. పగలంతా ఇక్కడ ఉండి.. రాత్రివేళలో పొలాలపై పడి పంటలను ధ్వంసం చేయడం పరిపాటిగా మారింది. ఎఫ్ఎస్‌వో మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో చాకలికోన తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపును డ్రోన్ సాయంతో గుర్తించారు. అడవిలో 16 ఏనుగులు ఉన్నాయని. ఇందులో అధికంగా పిల్ల ఏనుగులున్నాయని ఎఫ్‌బీవో మున్నా తెలిపారు. పొలాలవైపు రాకుండా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు తెలిపారు. కాగా, దేవళంపేట పంచాయతీ వీకేపల్లె సమీపంలో మంగళవారం రాత్రి పంటలపై ఏనుగులు దాడులు చేశాయి. వీకేపల్లెలోని రెడ్డిశేఖర్‌నాయుడికి చెందిన ఎకరా టమోటా పంటను ధ్వంసచేసి.. డ్రిప్ పైపులను విరిచేశాయి. సుధాకర్ నాయుడికి చెందిన మామిడి, అరటి పంటను పాడుచేశాయి. చలపతినాయుడు మామిడితోటకు ఏర్పాటుచేసిన ఇనుప గేటును కూల్చేశాయి. మామిడి, పనస, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడిలో నష్టపోయిన పంటలను అటవీశాఖ అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలను పంపిస్తామని తెలిపారు.


ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా పంట

జడ్పీ మాజీ సీఈవోపై సీఎంకు ఫిర్యాదు

చిత్తూరు రూరల్, జూన్ 26: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకరరెడ్డిపై సీఎం చంద్రబాబు నాయుడికి బుధవారం కుప్పంలో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. వైసీపీ హయాంలో జడ్పీ సీఈవోగా ఆయన అవినీతికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, సర్పంచులు, కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఇతడి వేధింపుల కారణంగా నలుగురు ఉద్యోగులు మృత్యువాతపడ్డారని తెలిపారు. కోట్ల రూపాయల జడ్పీ నిధులను మంత్రికి ముట్టజెప్పారని ఫిర్యాదులో ఆరోపించారు. అనంతరం సీఎం ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్నను కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభాకరరెడ్డి అవినీతిపై డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గతంలో చిత్తూరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈయన ప్రభాకర్‌రెడ్డి వ్యవహారాలను దగ్గరగా చూశారు.

పీఆర్ కమిషనరేట్‌లో కదలని ఫైల్!

జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిపై టీడీపీ నాయకులు, ఉద్యోగులు, విశ్రాంత అధికారులు పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఆ ఫైల్ ముందుకు కదలడం లేదని తెలిసింది. ఈ నెలాఖరున ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ చేయనున్నారు. ఈలోగా ఈయన్ను సస్పెండ్ చేయించాలని పట్టుగా ఉన్న టీడీపీ నాయకులు.. పీఆర్ కమిషనరేట్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు.



ద్విచక్ర వాహనమా
పుష్పక విమానమా..!

అది స్కూటర్. ఓహో అంటే అత్యవసర పరిస్థితుల్లో ముగ్గురు.. ఇంకా మించితే చిన్నపిల్లలున్న కుటుంబమైతే నలుగురు వెళ్లడం చూసుంటాం. కానీ, బుధవారం చిత్తూరు నగరం మిట్టూరులో ఏడుగురితో స్కూటరులో వెళ్తుండటం చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. దీని కోసం కర్రలసాయంతో ప్రత్యేకంగా స్టాండునూ ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి ప్రయాణం ప్రమాదకరం మరి.

- చిత్తూరు సిటీ







చిన్నారి తాన్విక

నామకరణం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

శాంతిపురం మండలం తుమ్మిశి రోడ్డుకు చెందిన టీడీపీ వీరాభిమానులు అశోక్, సరస్వతి మనవరాలు, ప్రియాంక, సుధాకర్ దంపతుల కుమార్తెకు 'తాన్విక' అని సీఎం చంద్రబాబు నామకరణం చేశారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వినతుల స్వీకరణ సందర్భంగా వీరు వెళ్లి తమ బిడ్డకు నామకరణం చేయాలని చంద్రబాబును కోరారు. ఆ మేరకు ఆయన పేరు పెట్టారు.

వినతుల స్వీకరణ

కుప్పంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద బుధవారం ఉదయం ప్రజల నుంచి సీఎం చంద్రబాబు వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరిని పలకరిస్తూ వారి సమస్యలను విన్నారు. కొన్నింటిని అప్పటికప్పుడే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. తక్షణం పరిష్కారం కాని వాటిని ఆయా అధికారులకు పంపి వారం పది రోజుల్లో పరిష్కరించాలన్నారు.

బై.. వెళ్లొస్తా..!

రెండు రోజుల కుప్పం పర్యటన ముగించుకుని బుధవారం సాయంత్రం చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా పీఈఎస్‌లోని హెలిప్యాడ్ వద్ద ఆయనకు ఘన వీడ్కోలు లభించింది. కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ శ్రీనివాసులు, ఇతర అధికారులు.. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, బాబునాయుడు, రాజకుమార్, ప్రేమ్‌కుమార్, ఆనందరెడ్డి తదితర నేతలు, శ్రేణులు, ప్రజలు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

- శాంతిపురం/గుడుపల్లె

చెట్టుపై నుంచి పడి టీడీపీ కార్యకర్త దుర్మరణం



చంద్ర(ఫైల్‌ఫొటో)

రామకుప్పం, జూన్ 25: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ వినాయకపురానికి చెందిన టీడీపీ కార్యకర్త చంద్ర(30) చెట్టుపై నుంచి పడి దుర్మరణం పాలయ్యాడు. బంధువులు, పోలీసుల కథనం మేరకు... చంద్ర మంగళవారం సాయంత్రం గొర్రెలకు ఆకు కోసం ఇంటి సమీపంలోని వేపచెట్టు ఎక్కాడు. ఆకులు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయాడు. అపస్మారకస్థితికి చేరుకున్న అతన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం ఆటోలో కుప్పం బయలుదేరారు. మార్గమధ్యంలో శాంతిపురం పాలారు బ్రిడ్జి వద్దకు వెళ్లేసరికి అతను ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబసభ్యులు అతడి మృతదేహాన్ని ఇంటి వద్దకు తీసుకువచ్చారు. మృతుడి భార్య భువనేశ్వరి ఘటనపై రామకుప్పం పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు నందారెడ్డి, మునిరెడ్డి, సుబ్రహ్మణ్యం, మురళీ, పెరుమాళ్, చంద్ర శేఖర్‌రెడ్డి, రంగనాథం, మురళీరెడ్డి, చంద్రారెడ్డి, రామచంద్ర, రామచంద్రరెడ్డి, గోపాలన్న, అమరనాథ్ తదితరులు చంద్ర మృతదేహానికి నివాళులర్పించారు.

వైసీపీకి ఓటు వేయలేదని మహిళపై దాడి



పుంగనూరు రూరల్, జూన్ 26: ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయలేదని ఓ మహిళపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడిన ఘటన బుధవారం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లెకు చెందిన మల్లి భార్య సరస్వతి(45) ఇటుకల బట్టీ వద్ద ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తోంది. కమతంపల్లె, రాంపల్లెకు చెందిన మునిరాజ, వరలక్ష్మి, శ్రీనివాసులు, అంజి, కిషోర్‌తోపాటు మరికొందరు సరస్వతమ్మ ఇంటిపైకి దాడి చేసి గ్రామం వదిలి వెళ్లిపోవాలని, ఎన్నికల్లో వైసీపీ ఓటు వేయలేదని కొట్టి గాయపరిచడంతో ఆమె పోలీసులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చింది. ఎస్‌ఐ సుబ్బారెడ్డి సిబ్బందిని పంపడంతో అప్పటికే వైసీపీ శ్రేణులు పరారైనట్లు తెలిపారు. సరస్వతి ఫిర్యాదు మేరకు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ శ్రేణుల దాడి



గాయపడ సుబ్రహ్మణ్యరెడ్డి

చౌడేపల్లె, జూన్26: వైసీపీ శ్రేణుల దాడితో టీడీపీ కార్యకర్త గాయపడి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి కథనం మేరకు ... మండలంలోని కాటిపేరి గ్రామానికి చెందిన ఎస్.సుబ్రహ్మణ్యంరెడ్డి మంగళవారం రాత్రి పాడిఆవులకు మేత వేసి ఇంటికి వస్తుండగా ఆదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజారెడ్డి, చంద్రారెడ్డి, రమణరెడ్డి రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త ఎస్.సుబ్రహ్మణ్యం రెడ్డి తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే బాధితుడిని 108 వాహనంలో పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు కల్పించారు.

స్మగ్లర్లను నిరోధించేలా చర్యలు : ఎస్పీ



ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు స్వాగతం పలుకుతున్న శ్రీనివాస్

మంగళం, జూన్ 26: ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా స్మగ్లర్లను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ ఇంచార్జ్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్న విధానం, అడవుల్లో చేపడుతున్న కూంబింగ్ సమాచార వ్యవస్థ, అటవీశాఖ అధికారుల పనితీరు గూర్చి ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్మగ్లర్లను పట్టుకునేందుకు వీలుగా ఆపరేషన్లు చేపట్టాలని, ఫీల్డ్ ఆపరేషన్‌లో అటవీశాఖ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. డీఎస్పీ చెంచుబాబు, ఏపీఎఫ్ శ్రీనివాస్, ఆర్‌ఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, కుప్పానంద, చిరంజీవి, కడప, రైల్వేకోడూరు సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం

మంగళం, జూన్ 26: పీలేరు వద్ద తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించి నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఓ కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్‌కు అందిన సమాచారం మేరకు.. పీలేరు ప్రభుత్వ ఐటీఐ సమీపంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో ఏపీ 31ఎడబ్ల్యూ 8433 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ వాహనం అటువైపుగా రావడాన్ని అధికారులు గమనించారు.దీంతో వాహనాన్నిఆపే ప్రయత్నం చేయగా, ఆపకుండా వెళ్లిపోయింది. వెంబడించగా కారును వదిలి వెళ్లిపోయారు. వాహనం, అందులో ఉన్న దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడ్డ ఎర్రచందనం 128.5కిలోల బరువు ఉందని డీఎఫ్‌వో శివకుమార్ తెలిపారు. పారిపోయినవారి కోసం గాలిస్తున్నారు. సిబ్బంది కోదండన్, చంద్రబాబు, సాయికిరణ్, నాగులయ్య, భార్గవ్, వినీల్‌కుమార్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

6 కేజీల గంజాయి పట్టివేత

మంగళం, జూన్ 26 : తిరుపతి నగర శివారు ప్రాంతమైన మంగళం పరిధిలోని బొమ్మల క్వార్టర్స్ వద్ద 6 కేజీల గంజాయిని పట్టుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తిరుచానూరు సీఐ శ్రీకాంత్ రెడ్డి కథనం మేరకు...బొమ్మల క్వార్టర్స్‌లో గంగాధర్, కృష్ణారెడ్డి,ఫరీదా అనే ముగ్గురు గంజాయి అమ్ముతున్నట్టు తెలుసుకున్న పోలీసులు బుధవారం వారిని అదుపులోకి తీసుకున్నారు.గతంలోనూ వీరు గంజాయి కేసుల్లో నిందితులైనట్లు గుర్తించారు.గంజాయి విక్రయాలతో ఇక్కడి ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు పెడదారి పట్టడంతో పాటు స్థానిక యువత నేరాలు,ఘోరాలకు పాల్పడుతున్నారని సీఐ తెలిపారు.నిందితులపై తిరుచానూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

పూజారులే బాగలేరు!

కొందరు ఆ పార్టీకి తొత్తులుగా మారారు ● పార్టీ కేడర్‌పై చంద్రబాబు అసహనం ● పోలింగ్ కేంద్రాలవారీగా ఓటింగ్‌పై సమీక్ష ● మెజారిటీ తగ్గడంపై తీవ్ర అసంతృప్తి



సమావేశంలో పాల్గొన్న టీడీపీ కేడర్

కుప్పం, జూన్ 26: 'దేవుడు బాగున్నాడు. భక్తులూ బాగున్నారు. పూజారులే బాగలేరు' అంటూ కొందరు నాయకుల పనితీరుపై సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తంచేశారు. 'ఇప్పటికి జరిగింది చాలు. ఇకమీదట ఇలా మిమ్మల్ని, నా నియోజకవర్గాన్ని వదిలేయను. ఇకపై నేనే నియోజకవర్గ పార్టీని సమన్వయం చేసుకుంటూ, వారానికోసారి సమీక్షించి నేరుగా టచ్‌లో ఉంటా'నని స్పష్టం చేశారు. కుప్పంలోని పీఈఎస్ ఆడిటోరియంలో బుధవారం ఆయన పార్టీ కేడర్‌తో సమావేశమయ్యారు. తనకు 48 వేల మెజారిటీ రావడంపైనే చాలా సమయాన్ని కేటాయించారు. ముఖ్యంగా స్టేజీమీద ఉన్న నేతలనే టార్గెట్ చేశారు. 35 బూత్‌ల్లో మైనస్ ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఆయా బూత్‌ల క్లస్టర్ ఇన్‌ఛార్జిలను నిలబెట్టి సంజాయిషీ కోరారు. 'ఎన్నికల ముందు చేసిన ఐవీఆర్ఎస్ సర్వేలో ఏయే బూత్‌ల పరిధిలో మైనస్ ఉందో నేను మీకు చెప్పాను. సరిచేసుకొమ్మని హెచ్చరించాను. అయినా మీరు ఖాతరు చేయలేదు. లోపాలను గుర్తించి సరిచేసుకోలేనివారు నాయకులు ఎలా అవుతారు?' అని నిలదీశారు. బాధ్యతలు తీసుకున్న చాలామందికి అత్యుత్సాహం ఎక్కువైపోయిందని, అందుకనే మెజారిటీ పడిపోయిందన్నారు. 'కొంతమంది ఆ పార్టీకి తొత్తులుగా మారారు. ఎన్నికల ముందు, తర్వాత కూడా కుమ్మక్కయారు. వారెవరో నాకు తెలుసు. అందరినీ సరిచేస్తా. అలాంటి వారిని ఏరేస్తా' అంటూ ఆగ్రహించారు. 'మీరు నా దగ్గర షో చేయడానికి, పదవుల కోసం ఇకపై రానవసరం లేదు. పనిచేసేవారెవరో, షో మాత్రమే చేసిందెవరో నాకు తెలుసు. పనిచేసిన వారిని గుర్తించి వారి ఇంటికే వెళ్లి పూలమాల వేసి మరీ లీడర్‌ను చేస్తా. అలాంటి వారికి సంపాదన మార్గాలు చూపుతా. స్వయంగా ఎదగడానికి అవకాశాలు కల్పిస్తా. ఇంతదాకా ఒక టర్మ్ గడిచింది. ఇకమీదట నాలోను, పార్టీ వ్యవహారాలలోనూ స్పష్టమైన మార్పు చూస్తారు' అని చంద్రబాబు చెప్పారు.

2029 ఎన్నికలే లక్ష్యం

'జరిగిందేదో జరిగిపోయింది. ఇకమీదట 2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయండి' అని పార్టీ కేడర్‌కు చంద్రబాబు సూచించారు. 'నేను ఇదివరకులా నా నియోజకవర్గాన్ని ఇంకెవరి మీదో వదిలే ప్రసక్తే లేదు. నేరుగా సమీక్షలు జరుపుతాను. పార్టీని అట్టడుగు నుంచి పునర్వ్యవస్థీకరించడానికి చర్యలు తీసుకుంటాను. యువతకు ప్రథమ ప్రాధాన్యమిస్తా. మధ్యవయస్కులు, సీనియర్లు ఆ తర్వాతి రెండుమూడు స్థానాల్లో ఉంటారు. ఏ ఏజ్ గ్రూప్ వారైనా పనిచేసేవారికే పట్టం కడతా. అలాంటి వారిని గుర్తించడానికి నా పద్ధతులు నాకున్నాయి' అని అన్నారు. బూత్‌ల స్థాయిలో తానే ఎంపిక చేసి ఇన్‌ఛార్జిలుగా నియమిస్తానన్నారు.

కక్షసాధింపులొద్దు

గత అయిదేళ్ల పాలనలో జరిగినన్ని దాడులు, హింస, దారుణాలు ఎన్నడూ చూడలేదని చంద్రబాబు అన్నారు. 'నన్ను నైతికంగా దెబ్బతీయడానికి చూశారు. నియోజకవర్గంలో నేతలు, కార్యకర్తలపై దాడులు చేసి, ప్రలోభాలకు గురిచేసి నాయకత్వాన్ని దెబ్బతీయాలని కుట్రలు పన్నారు. అయినా వారి ఎత్తులు సాగలేదు' అని పేర్కొన్నారు. 'చాలామంది మన కార్యకర్తలు దాడులకు గురయ్యారు. అక్రమ కేసులలో తగులుకుని ఇబ్బంది పడ్డారు. వ్యక్తిగతంగా వారి కుటుంబాలు అల్లకల్లోలమయ్యాయి. అయితే మీరు నేరుగా దాడి చేసే కక్షపూరిత చర్యలకు పాల్పడవద్దు. ఎవరివల్ల మీమీద దౌర్జన్యాలు జరిగాయో పేర్కొంటూ పార్టీ లెటర్ ప్యాడ్లలో రాసి సంతకాలు పెట్టి, కార్యాలయంలో అందజేయండి. వాటిని ప్రతివారం నేను తెప్పించుకుని సమీక్షిస్తా. దౌర్జన్యకారులపై చట్టపరంగానే చర్యలు తీసుకుంటా' అని చంద్రబాబు స్పష్టంచేశారు. టీడీపీ ప్రభుత్వం వస్తే ప్రశాంతత ఉంటుందని ప్రజలు ఫీల్ కావాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కుప్పంనుంచే ప్రారంభమై రాష్ట్రమంతా విస్తరించాలని ఆకాంక్షించారు.

కండిషన్ బస్సులను రోడ్లపైకి తీసుకొస్తాం

మోడల్‌గా కుప్పం బస్టాండ్ ● నూతన ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



కుప్పం బస్టాండులో నూతన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

కుప్పం, జూన్ 26: 'ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే ఆర్టీసీ లక్ష్యం. దీనికోసం కండిషన్ కలిగిన బస్సులను రోడ్లపైకి తీసుకొస్తాం'అని రవాణా, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. కుప్పం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బుధవారం ఆయన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రవివర్మ, చంద్రశేఖర్, జి.వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజినీరు యు.శ్రీనివాస్, రీజినల్ మేనేజరు జితేంద్రనాథ్‌రెడ్డితో కలిసి ఐదు నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. బస్టాండు, డిపో, గ్యారేజీలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కుప్పం ఆర్టీసీ బస్టాండును రాష్ట్రంలోనే మోడల్ బస్టాండుగా చేస్తామన్నారు. అత్యున్నత ప్రమాణాలు కలిగిన బస్టాండుగా మార్చేలా నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అనుసరించి నాలుగైదు రకకాలకు సంబంధించిన డీపీఆర్‌లు తయారు చేయాలని అధికారులను ఆదేశిస్తామన్నారు. కార్మికులు, ప్రజల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇక మంచి రోజులు వచ్చాయన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలో నడిపించడానికి ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తామన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు కుప్పంనుంచి హైదరాబాదుకు, గురువారం ఉదయం 5 గంటలకు కుప్పంనుంచి నెల్లూరుకు ఈ కొత్త బస్సులు బయలుదేరుతాయన్నారు. వీటితోపాటు గతంలో రద్దయిన 30 సర్వీసులను మళ్లీ పునరుద్ధరిస్తామన్నారు. భవిష్యత్తులో కుప్పంనుంచి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సర్వీసులు నడుపుతామని మంత్రి చెప్పారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగులు, కార్మికులు టీడీపీకి ఏకపక్షంగా ఓట్లేసి గెలిపించి ఆదరించారని గుర్తు చేసుకున్నారు.

ఎస్వీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26: ఎస్వీయూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బి.చంద్రయ్య నియమితులయ్యారు. ఇప్పటి వరకూ రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ హుస్సేన్ తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన ప్రొఫెసర్ హుస్సేన్ టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రిజిస్ట్రార్ పదవి నుంచీ వైదొలిగారు. యూనివర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బి.చంద్రయ్యను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఈ మేరకు బుధవారం అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య బాధ్యతలు స్వీకరించారు. నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు పి.కె.సుబ్రమణ్యం, ఎన్.సుబ్రమణ్యం, గుర్రంకొండ శ్రీధర్, రవిచంద్ర, ఎన్ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, తదితరులు అభినందించారు.

18 ఇసుక ట్రాక్టర్ల సీజ్



తిరుచానూరు, జూన్ 26: తిరుచానూరు పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 18 ట్రాక్టర్లను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. స్వర్ణముఖినదిలో ఎక్స్‌వేటర్లను పెట్టి ఇష్టానుసారంగా వైసీపీ ఇసుక మాఫియా వందల ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తోంది. దీనిపై 'ఆగని ఇసుక దందా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో స్పందించిన సెబ్ అధికారులు, పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. ఒక్క తిరుచానూరు వద్దే 18 ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. స్వర్ణముఖినదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

గుజ్జుపరిశ్రమల యాజమాన్యాలు సిండికేట్ అయ్యాయి..

● సీఎంకు టీడీపీ నేతల ఫిర్యాదు



సీఎంకు మామిడి రైతుల సమస్యలను వివరిస్తున్న దొరబాబు, సీఆర్ రాజన్

చిత్తూరు సిటీ, జూన్ 26: జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు సిండికేట్ అయ్యాయని, తద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. కుప్పంకు వచ్చిన సీఎంను వారు బుధవారం కలసి మామిడి రైతుల సమస్యలను వివరించారు. దళారీ వ్యవస్థ వల్ల రైతులు టన్నుకు రూ.5 వేల వరకు నష్టపోతున్నారని చెప్పారు. మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు ట్రేడ్ వ్యాపారులతో కుమ్మక్కై రోజుకో ధర నిర్ణయిస్తున్నారని పేర్కొన్నారు. పక్క రాష్ట్రాల గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలను జిల్లాలోకి రానీయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను, జిల్లా అధికారులను సైతం గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు లెక్కచేయడంలేదని వివరించారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు.

టీడీపీ ఎంపీటీసీ దంపతుల హత్యకు కుట్ర

కిరాయి వ్యక్తులతో వైసీపీ నేతల ఒప్పందం ● బహిర్గతం కావడంతో తప్పొప్పుకున్న నిందితులు ● క్షమించి పెద్దమనసు చాటుకున్న ఎంపీటీసీ దంపతులు



సమావేశంలో ప్రసంగిస్తున్న మధుసూదన్

ఎర్రావారిపాలెం,జూన్ 26 : టీడీపీ ఎంపీటీసీ దంపతుల హత్యకు కుట్ర పన్ని కిరాయి హంతకులకు సుపారీ కూడా ఇచ్చిన వైసీపీ నాయకుల వృదంతమిది. ఎర్రావారిపాలెం మండలం కూరపర్తివారిపల్లికి చెందిన అభ్యుదయవాది అన్నాసముద్రం మధుసూదన్ టీడీపీ నాయకుడు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఇతను అదే గ్రామానికి చెందిన ఈశ్వరమ్మను గతంలో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈమె ప్రస్తుతం ఎంపీటీసీ. మధుసూదన్ రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేని కొందరు పలుసార్లు గొడవపడ్డారు. మండలానికి చెందిన ఓ బడా వైసీపీ నాయకుడి సహకారంతో ఆ పార్టీ వర్గీయులు ప్రతాపరెడ్డి, సిద్ధరామిరెడ్డి, నారాయణరెడ్డి ఎంపీటీసీ దంపతులను హత్య చేసేందుకు కుట్ర పన్నారు. కేవీపల్లికి చెందిన కిరాయి వ్యక్తులతో రూ.5లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. ఎర్రావారిపాలెం, తిరుపతి ప్రాంతాల్లో కిరాయివ్యక్తులు రెండుసార్లు హత్యకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో ఎన్నికలు జరగడం, టీడీపీ అధికారంలోకి రావడంతో కిరాయి ముఠా పన్నాగం ఆలస్యమైంది.దీంతో హత్య చేసేందుకు తామిచ్చిన డబ్బు తిరిగి చెల్లించాలని కిరాయి వ్యక్తులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చారు. అప్పటికే మధుసూదన్ మంచితనం గురించి తెలుసుకున్న కిరాయి వ్యక్తులు మనసు మార్చుకున్నారు. హత్య పన్నాగం గురించి అతడికే చెప్పి క్షమించాలని కోరారు. హత్య కుట్రదారులు తమతో జరిపిన ఫోన్ సంభాషణలను కూడా మధుకు వినిపించారు. హత్య కుట్ర బహిర్గతం కావడంతో గ్రామస్తులందరూ విస్మయం చెందారు. ఈ నేపథ్యంలో ఆరేటమ్మ గుడి ప్రాంగణం వద్ద బుధవారం మండలానికి చెందిన పెద్దలందరూ సమావేశమై వైసీపీ నేతలు ముగ్గురినీ పిలిపించారు.కుట్రదారులు తమ అపరాధాన్ని మన్నించాలని వేడుకొన్నారు. ఆరేటమ్మ గుడి అభివృద్ధికి తలో రూ.10 లక్షలు ఇస్తామన్నారు. వీరిని గ్రామ బహిష్కరణ చేయాలని తీర్మానించినా మధుసూదన్ వద్దని వారించారు. కక్షప్రతీకారం వీడి కలసి ఉందామని హితవు పలికారు.ఈలోపు కుట్రదారులకు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పలమనేరుకు ఇక పల్లెవెలుగు బస్సులే !

- రాత్రికి రాత్రే మూకుమ్మడిగా కండెక్టర్లు, డ్రైవర్ల బదిలీ ● 13 సర్వీసులు కుప్పం డిపోకు బదలాయింపు


పలమనేరు బస్టాండులో నిలిచి ఉన్న పల్లెవెలుగు బస్సులు

పలమనేరు, జూన్26 : ఒకప్పుడు జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచి ఉన్న పలమనేరు ఆర్టీసీ డిపో నేడు అథమ స్థానానికి చేరుకుంది. ఆర్టీసీ ఉన్నతాధికారుల నిర్వాకంతో గత దశాబ్దకాలంగా ఇక్కడి బస్సు సర్వీసులను రద్దుచేయడం, మరికొన్ని సర్వీసులను వేరే డిపోలకు కేటాయిస్తూ వచ్చారు. దీంతో ఇక్కడి నుంచి నడుస్తున్న విజయవాడ, నెల్లూరు, శ్రీహరికోట, చెన్నై, కంచి, అనంతపురం, మంత్రాలయం, హైదరాబాదుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో కొన్ని రద్దు కాగా మరికొన్ని పొరుగు డిపోలకు పంపించారు. నాలుగేళ్ల క్రితం మదనపల్లి-చిత్తూరు లైటినింగ్ సర్వీసులు పూర్తిగా మదనపల్లి, చిత్తూరు డిపోలకు బదలాయింపు చేశారు. తాజాగా కారణాలు తెలియదు గానీ మంగళవారం రాత్రికి రాత్రే 13 సర్వీసులను కుప్పానికి బదిలీ చేయడంతోపాటు ఇక్కడ పనిచేస్తున్న 30 మంది కండెక్టర్లను, డ్రైవర్లను సైతం కుప్పం డిపోకు బదిలీ చేశారు. దీంతో పలమనేరు డిపోలో ఉన్న బస్సుల సంఖ్య 33కు పడిపోయింది. వీటితోపాటు 7 కాంట్రాక్టు బస్సులు నడుపుతున్నారు. ఇందులో కూడా మూడు బస్సులు విద్యార్థుల కోసం కేటాయించడంతో ఇక ప్రయాణీకుల కోసం ఈ డిపోలో ఉన్న బస్సులు కేవలం 30 మాత్రమే. తమిళనాడు, కర్ణాటక సరిహద్దులో ఉన్న ఈ డిపోలో బస్సుల సంఖ్య తగ్గించి వేస్తున్నా ఇక్కడి ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోక పోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. నియోజకవర్గ కేంద్రంగాను, రెవెన్యూ డివిజన్‌గా, మున్సిపాలిటీగా రోజురోజుకు జనాభా పెరుగుతున్న నేపథ్యంలో డిపోలో మరిన్ని బస్సు సర్వీసులు నడపక పోగా ఉన్న సర్వీసులను ఇతర డిపోలకు తరలించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ప్రయాణీకులు జాతీయ రహదారిపై గంటల తరబడి నిల్చొని బెంగళూరు, విజయవాడల బస్సులకోసం వేచి చూస్తున్నారు. ఇక తిరుపతి, వేలూరు వెళ్లాలన్నా పొరుగురాష్ట్రాలనుంచి వచ్చే బస్సులు లేదా పొరుగు డిపో బస్సులకోసం వేచి వుండాల్సిన దుస్థితి. వాస్తవానికి కుప్పం డిపోనుంచి ఉదయం నాలుగు గంటలనుంచే తిరుపతి, తిరుమలకు బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సులు 70 కిలోమీటర్లు దూరంలోని పలమనేరుకు చేరుకొనేలోపు పూర్తి స్టాండింగ్‌లో వస్తుంటాయి. ఒకవేళ కొందరు ప్రయాణీకులు పలమనేరు స్టాపింగ్‌లో దిగినా సీట్లు మాత్రం ఖాళీగా వుండవు. దీంతో చిత్తూరు వరకు నిల్చొని ప్రయాణిస్తే గాని తదుపరి బస్సులు మారితే లేదా ఒకవేళ చిత్తూరులో ప్రయాణికులు దిగితే గానీ వారికి సీట్లు వుండవు. పలమనేరు డిపో దుస్థితిపై రెండేళ్లుగా పలుమార్లు ఇక్కడి పలమనేరు పరిరక్షణ సమితి ఆందోళనలు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇక కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వం కూడా అదేబాటలో వెళ్తుండటంతో ఇక్కడి ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

చంద్రబాబుకు ఎమ్మార్పీఎస్ నేతల జేజేలు



చంద్రబాబుకు జేజేలు పలుకుతున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు, సీఎంకు కిరీటం అందజేస్తున్న చలపతి, లత

కుప్పం/వి.కోట, జూన్26: ఎస్సీ వర్గీకరణకు సానుకూల ప్రకటన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మార్పీఎస్ కేడర్ ద్వారా బుధవారం ఘన స్వాగతం లభించింది. మంగళవారం బహిరంగ సభలో సీఎం తమ పార్టీ ఎస్సీ వర్గీకరణకు సానుకూలమని ప్రకటించారు. ఈ ప్రకటన గురించి ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న మంద కృష్ణమాదిగ స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలతో ఫోన్ ద్వారా చర్చించి ముఖ్యమంత్రి చంద్రబాబును సన్మానించాలని ఆదేశించారు. దీంతో నియోజకవర్గంనుంచి వందలాదిగా ఎమ్మార్పీఎస్ కేడర్ బుధవారం ఆయన బస చేసిన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకుంది. అక్కడ సంస్థ జెండాలతో జేజేలు పలికింది. ఎనిమిది మంది ప్రతినిధుల బృందం గెస్ట్ హౌస్‌లోకి వెళ్లి చంద్రబాబును ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపింది. అనంతరం పీఈఎస్ ఆడిటోరియానికి బయలుదేరిన చంద్రబాబుకు రోడ్డుమీద నిలబడి ఎమ్మార్పీఎస్ జెండాలతో ఆ సంస్థ శ్రేణులు స్వాగతం చెబుతూ జేజేలు పలికాయి. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ మాదిగ, జాతీయ నాయకుడు ఎస్.సురేంద్రబాబు, సీనియర్ నాయకుడు దేవరాజ్ మాదిగ, కుప్పం ఇన్‌ఛార్జి రాజ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసుదేవరావు, ఎమ్మెస్పీ సీనియర్ నాయకుడు నరసింహులు, ఇతర నాయకులు శివ, సుధాకర్, వెంకటాచలం, ప్రకాశ్, రవి, గోపాల్, అనిల్, సాయి, హరి, ఉమాపతి, గురుప్రసాద్, ప్రభాకర్, కిరణ్, జయరాం, రవీంద్ర, పాపన్న పాల్గొన్నారు.

పీఈఎస్ కళాశాల సమీపంలో...

పీఈఎస్ కళాశాల సమీపంలో నగరికి చెందిన తెలుగు మహిళలు సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. బుధవారం మధ్యాహ్నం నగరి నుంచి రెండు బస్సులలో కుప్పం చేరుకున్న టీడీపీ శ్రేణులు 105 మంది పసుపు జెండాలు చేతపట్టి రోడ్డు పక్కన నిలబడి జై బాబు.. జైజై బాబు.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. అటుగా వాహనశ్రేణిలో వచ్చిన చంద్రబాబు వారిని చూసి బస్సు ఆపి దిగారు. దీంతో నగరికి చెందిన టీడీపీ సీనియర్ నేత రామానుజం చలపతి, మాజీ కౌన్సిలర్ లతలు ఆయనకు కిరీటం, మందార మాలను అందించారు. వారి వెంట ఆది ఆంధ్రవాడకు చెందిన తెలుగు మహిళలు, తెలుగు యువత ఉన్నారు.

ద్రావిడ వర్సిటీలో రీసెర్చ్ అసిస్టెంట్లను నియమించాలి

- సీఎం చంద్రబాబుకు పూర్వ పరిశోధకుల వినతి

గుడుపల్లె, జూన్ 26: ద్రావిడ విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ అసిస్టెంట్లను నియమించాలని వర్సిటీ పూర్వ పరిశోధకులు సీఎం చంద్రబాబుకు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2003 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం వర్సిటీల్లో పరిశోధనలు విస్తృతం చేయడానికి రీసెర్చ్ అసిస్టెంట నియామకం కోసం జీవో నెంబరు 196 విడుదల చేసిందన్నారు. హిస్టరీ, ఎడ్యుకేషన్, జానపద, తులనాత్మక ద్రావిడ సాహిత్యం శాఖల్లో సీనియర్, జూనియర్ రీసెర్చ్ అసిస్టెంట్ల నియమకానికి అనుమతులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. అయితే తర్వాత వచ్చిన పాలకులు రీసెర్చ్ అసిస్టెంట్ల నియామకాలను గాలికి వదిలేశారన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ అసిస్టెంట్లను నియమించాలని వినతి పత్రాన్ని అందించారు. సీఎం సానుకులంగా స్పందించినట్లు పరిశోధకులు తెలిపారు.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారం



ప్రసంగిస్తున్న న్యాయవాది భాస్కర్, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ శ్రీనివాసమూర్తి

పలమనేరు, జూన్26 : విద్యార్థులు మాదక ద్రవ్యాల బారినపడితే జీవితం అంధకారమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కన్నయ్య, అధ్యాపకుడు శ్రీనివాసులుతోపాటు న్యాయవాదులు ఎల్.భాస్కర్, ఇస్మాయిల్, అరీఫుల్లా విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల బారిన పడితే విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తును పోగొట్టుకోవడంతోపాటు ఆరోగ్యాన్ని కోల్పోతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కల్లూరు : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పులిచెర్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శ్రీనివాసమూర్తి తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పులిచెర్ల ఎస్ఈబీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలు వాడితే జీవితం అందకారమవుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మత్తుపదార్థాలు, గంజాయి విక్రయాలకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ తులసీరాం, అధ్యాపకులు, ఎస్ఈబీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : మాదకద్రవ్యాలకు యువతదూరంగా ఉండాలని ఎస్ఈబీ సీఐ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ అధ్యాపకులు, ఎస్ఈబీ పోలీసులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్‌ను వినియోగించినా, విక్రయించినా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ దయానందరాజు, ఎస్ఐ సుబ్బారెడ్డి, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రౌపది కల్యాణోత్సవం



కల్లూరు, జూన్ 26: కల్లూరులో బుధవారం ద్రౌపది కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ద్రౌపది ధర్మరాజుల ఆలయాన్ని వివిధర కాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం కల్యాణ వేదికపై ద్రౌపది, పాండవుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ ద్రౌపది కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా పాళెం పంచాయతీ జూపల్లికి చెందిన మునీశ్వర్ సురేఖ దంపతులు వ్యవహరించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు తప్పనిసరి

సోమల, జూన్26 : ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా వైద్యపరీక్షలు నిర్వహించాలని డీపీఎంవో రాంమోహన్ సూచించారు. బుధవారం సోమల పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో సమావేశమై ఆయన మాట్లాడుతూ వైద్యశాలల్లో తప్పనిసరిగా బాలింతలు, గర్భిణీలకు టీకాలు వేయాలన్నారు. చిన్నారులకు క్రమంగా రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు వివరాలను పరిశీలించారు. ఇరికిపెంట, ఎర్రనాగులవారిపల్లె, సోమల ప్రభుత్వ బడులను సందర్శించారు. ఆయన వెంట వైద్యాధికారి జయసింహ, ఎంఈవో శివరత్న, అమరనాథ్, మధునిక పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు డీఎస్సీలో మినహాయింపు ఇవ్వండి

కుప్పం/వి.కోట, జూన్ 26: రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 24 ఏళ్ళుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు డీఎస్సీలో మినహాయింపు ఇవ్వాలని సీఎం చంద్రబాబును కలసి సంబంధిత యూనియన్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. బుధవారం కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయనను కలసిన ఔట్ సోర్సింగ్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ తరపున ఆయనను కలసి వారి ఆవేదనను విన్నవించారు. రెండు దశాబ్దాలుగా 1700 మంది గెస్ట్ ప్యాకల్టీగా విధులు నిర్వహిస్తూ గురుకులాల్లో వంద శాతం ఉత్తీర్ణతకు పనిచేశామన్నారు. డీఎస్సీలో తమ పోస్టులు ఖాళీగా చూపారని, వాటిని మినహాయించి తమను రెగ్యులర్ చేయాలని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనాయక్, ప్రధాన కార్యదర్శి దమయంతి, ఇతర సభ్యులు ఉన్నారు.

విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు పెట్టడం హర్షణీయం

పుంగనూరు రూరల్, జూన్ 26: సీఎం చంద్రబాబు విదేశీ విద్యకు డాక్టర్ అంబేడ్కర్ పేరు పెట్టడం హర్షణీయమని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కులాల సబ్‌ప్లాన్ నిధులు ఇతర వాటికి ఖర్చు చేసి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసులు, అశోక్‌కుమార్, రాజన్న, కృష్ణప్ప, వెంకటరమణ, మహేశ్, రమణ, చిన్నబ్బ, శంకర్, కుమార్, తల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం కోసం స్థల పరిశీలన


కోటపల్లె సమీపంలోని ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్

గుడుపల్లె, జూన్ 26: కుప్పం నియోజకవర్గంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు కోటపల్లె సమీపంలోని ప్రభుత్వ భూమిని బుధవారం పరిశీలించారు. రైతులకు ఉపయోగపడేలా కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు సంబంధించి స్థలాలను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కోటపల్లె సమీపంలో స్థలం చదునుగా లేకపోవడంతో మరో స్థలాన్ని ఎంపిక చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో శ్రీనివాసులు, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్, కుప్పం టీడీపీ ఇన్‌చార్జ్ మునిరత్నం, టీడీపీ విస్తరణ విభాగం ఛైర్మన్ డాక్టర్ బీఆర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో క్షురకుడి మృతి


రవి (ఫైల్‌ఫొటో)

సదుం, జూన్ 26: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సదుంలో జరిగింది. స్థానిక వాల్మీకి వీధిలో నివసిస్తున్న కాగటి రవి(42) తిరుమల శ్రీవారి కళ్యాణ కట్టలో క్షురకుడిగా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై సదుం బయలుదేరాడు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకునేలోపే స్థానిక బట్టువారిపల్లె ఎరుకులపురం గుట్ట మలుపు వద్ద తన వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ చెట్టుకు ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఏడేళ్ల కుమారుడు, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు.

పంపింగ్, ఫిల్టర్ కేంద్రంలో లోపించిన పారిశుధ్యం


పంపింగ్ అండ్ ఫిల్టర్ కేంద్ర పరిసరాల్లో పిచ్చిమొక్కలు

పలమనేరు, జూన్26 : పలమనేరు ప్రజలకు తాగు నీటి సరఫరా కోసం పట్టణ నడిబొడ్డులో ఏర్పాటు చేసిన పంపింగ్ అండ్ ఫిల్టర్ కేంద్రంలో పారిశుధ్యం లోపించి, పిచ్చిమొక్కలు మొలిచినా అధికారులు పట్టించుకోలేదు. కౌండిన్య జలాశయం నుంచే కాక, నాగమంగళం వద్ద ఏర్పాటు చేసిన పంప్ హౌస్‌నుంచి కూడా నీటిని కొళాయిల ద్వారా సరఫరా చేసేందుకు ఎద్దుల సంత వీధిలో నీటిశుద్ధి చేసే యంత్రాలను ఏర్పాటు చేశారు. అలా శుద్ధి చేసిన వాటిని ఒక పెద్ద సంపులోకి మళ్లించి అక్కడినుంచి పంపింగ్ చేసి ప్రజలకు కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు. ఇటువంటి కీలకమైన ప్రజారోగ్యానికి సంబంధించిన కేంద్రంలో పారిశుధ్యం లోపించి ఫిల్టర్ పాయింట్, పంపింగ్ సంప్‌ల చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి వున్నాయి. దీంతో ఎక్కడ తాగునీరు కలుషితమవుతుందో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ ఫిల్టర్, పంపింగ్ కేంద్రంలో పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు సర్వీసుల పునరుద్ధరణకు వినతి

రామకుప్పం, జూన్ 26: రామకుప్పం, గుడుపల్లె, శాంతిపురం మండల కేంద్రాల నుంచి గతంలో ఉన్న ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని టీడీపీ మండల నేతలు నందారెడ్డి, అక్బర్‌సాబ్, సుబ్రహ్మణ్యం తదితరులు బుధవారం కుప్పంలో మంత్రి రాంప్రసాదరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. గ్రామాల నుంచి వ్యవసాయోత్పత్తులను రైతులు బెంగళూరు, కేజీఎఫ్, వాణియంబాడీ, కృష్ణగిరిలకు తరలిస్తుంటారని తెలిపారు. ఆ పట్టణాలకు నేరుగా బస్సులు లేకపోవడంతో రైతులు వ్యయప్రయాసలకు గురవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా పట్టణాలకు ఆర్టీసీ బస్సులు నడిపే విషయమై మంత్రి సానుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు.

చెరువులో మట్టి తరలింపు అడ్డగింత


చెరువులో తవ్వకాలను అడ్డుకుంటున్న వీఆర్వో

శాంతిపురం, జూన్ 26 : రాళ్ళబూదుగూరు చెరువు లో వైసీపీ నేత మట్టి తరలిస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. బుధవారం రాళ్ళబూదుగూరు పెద్ద చెరువులో అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నేత అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు రెవెన్యూ అధికారులకు చెప్పడంతో వీఆర్వో రామిరెడ్డి చెరువుకు వెళ్లి జేసీబీను, నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన కొంతమంది బండ్లు వదిలేయాలని ప్రాధేయపడడంతో మొదటి హెచ్చరిక అని సీజ్ చేసిన యంత్రాలను, ట్రాక్టర్లను వదిలేశారు.

సీఎంను కలిసిన చల్లా బాబు



పుంగనూరు, జూన్ 26: సీఎం నారా చంద్రబాబు నాయుడును పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. కుప్పం పర్యటన సందర్భంగా మంగళ, బుధవారం సీఎం చంద్రబాబుకు హెలీప్యాడ్‌వద్ద స్వాగతం పలికి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అలాగే సీఎం పర్యటన ముగిసి వెళ్లే సమయంలో చల్లా బాబు వీడ్కోలు పలికారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, జూన్26: ద్విచక్రవాహనం బోల్తా పడి ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం రాత్రి పుంగనూరు సమీపంలో జరిగింది. మేలుందొడ్డి పంచాయతీ గోపిశెట్టిపల్లెకు చెందిన జగన్నాథం, కుమార్తె శారద(35)లు పెద్దపంజాణి మండలలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహంలో వస్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో ఇద్దరినీ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

భాషోపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలి

కుప్పం/వి.కోట, జూన్26: ఐదేళ్ళుగా పదోన్నతుల కోసం వేచి ఉన్న భాషోపాధ్యాయులను డీఈవో పూల్ నుంచి విముక్తి కల్పించి పదోన్నతులు ఇవ్వాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం కుప్పంలో ఆయనను కలసిన బాషోపాధ్యాయులు గత టీడీపీ హయాంలో ఇచ్చిన 97 జీవోలను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టి జీవో 77ను అమలు జరిపి ప్రైమరీ టీచర్లకు పదోన్నతులు కల్పించి అర్హులైన భాషోపాధ్యాయులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భాషోపాధ్యాయులకు రెగ్యులర్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా భాషోపాధ్యాయులు మోహన్, హేమప్రసాద్, స్వామినాథన్, కమలనాథన్, మౌలా, జయంతి, సౌభాగ్య, సుగుణ, అనిత ఉన్నారు.

బాలప్పగారిపల్లెలో పారిశుధ్య పనులు

సోమల, జూన్ 26: కందూరు పంచాయతీ బాలప్పగారిపల్లెలో బుధవారం పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టారు. గ్రామ వీధుల్లో పేరుకు పోయిన చెత్త చెదారాన్ని సిబ్బంది, గ్రామస్తులు తొలగించారు. తాగునీటి కొళాయిల వద్ద మురుగు నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామస్తులకు వైద్య సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి జయశంకర్, సర్పంచు బాషా మసూద్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్ళబూదుగూరు ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



శాంతిపురం, జూన్ 26 : రాళ్ళబూదుగూరు ఎస్ఐగా నరేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎస్ఐగా ఉన్న సుమన్‌ను చిత్తూరు వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కడప ఏసీబీలో విధులు నిర్వహిస్తున్న నరేష్‌ను రాళ్ళబూదుగూరు ఎస్ఐగా నియమించారు. నరేష్ బుధవారం రాళ్ళబూదుగూరు స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు.

గుడుపల్లె ఎస్ఐగా శ్రీనివాసులు



గుడుపల్లె, జూన్ 26: గుడుపల్లె పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా డి.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీకాంత్ రెండు రోజుల క్రితం చిత్తూరు వీఆర్‌కు బదిలీ అయ్యారు.

సీఎంకు మీ సేవా సంఘం నేతల వినతి

శాంతిపురం, జూన్ 26 : రాష్ట్రంలోని మీ సేవా సంఘం నేతలు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు సమస్యలు పరిష్కరించాలని వినతి చేశారు. గత వైసీపీ ప్రభుత్వం 'మీ సేవ'లను నిర్వీర్యం చేసిందని, దాని వల్ల 20 వేల కుటుంబాలు ఉపాధిని కోల్పోయి వీధిన పడ్డాయని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకులంగా స్పందించినట్లు మీ సేవా సంఘం నేతలు తెలిపారు.

ఘనంగా గంగజాతర



బైరెడ్డిపల్లె, జూన్ 26 : మండలంలోని చీలంపల్లె, కైగల్, బాపలనత్తం గ్రామాల్లో గంగజాతర ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపు వైభవంగా నిర్వహించి బుధవారం ఉదయం విశ్వరూప దర్శనం ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాలనుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

హెచ్ఎంకు సన్మానం



బైరెడ్డిపల్లె, జూన్ 26 : బైరెడ్డిపల్లె బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన విశ్వనాథయ్యను బుధవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.ముఖ్యఅతిథిగా హాజరైన డీవైఈవో చంద్రశేఖర్ పాఠశాల అభివృద్ధికి హెచ్ఎం విశ్వనాథయ్య అందించిన సేవలను ప్రశంసించారు. ఎంఈవోలు వేణుగోపాల్, సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి స్థల విషయమై ఘర్షణ

ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, జూన్26: ఇంటి స్థలం కోసం ఇరువర్గాలు ఘర్షణ పడటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి కథనం మేరకు ... చౌడేపల్లె మండలం కొండయ్యగారిపల్లె పంచాయతీ రాణాకొత్తయిండ్లుకు చెందిన పి. వెంకటేశ్‌కు, అదే గ్రామానికి చెందిన గణపతి ఇంటి స్థలం విషయమై ఘర్షణ పడటంలో గణపతి వెంకటేశ్‌ను కర్రతో కొట్టి గాయపర్చాడు. గాయపడిన వెంకటేశ్‌ను ఆసుపత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కుక్క దాడిలో ఇద్దరు మహిళలకు గాయాలు



పుంగనూరు రూరల్, జూన్26: కుక్క దాడిలో ఇద్దరు మహిళలు గాయపడి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన బుధవారం పుంగనూరు జగనన్నకాలనీలో జరిగింది. పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద గల జగనన్న కాలనీకి చెందిన కనకమ్మ(60), యశోదమ్మ(62)లు తాగునీటి కొళాయి వద్ద నీరు పట్టుకుంటుండగా కుక్క వారిపై దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. గాయపడిన ఈ ఇద్దరిని కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

పుంగనూరు, జూన్ 26: పుంగనూరులో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని దూడవాండ్లఇండ్లు సమీపంలోని మురుగుకాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీటిని తొలగించి బ్లీచింగ్, పెనాయిల్‌ను పిచికారీ చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంటనే డీఈఈ మహేశ్, ఏఈ కృష్ణకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

సోమల, జూన్ 26: తిరుపతి ఆర్వో కార్యాలయానికి బదిలీ అయిన సోమల యూనియన్ బ్యాంకు మేనేజర్ రంగస్వామిని బుధవారం స్త్రీశక్తి భవనంలో వెలుగు అధికారులు, సంఘమిత్రలు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఏపీఎం శివయ్య మాట్లాడుతూ సంఘాలకు సంబంధించి అనేక సమస్యలను మేనేజర్ పరిష్కరించారని కొనియాడారు. నూతన మేనేజర్ లక్ష్మీప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రెడ్డెమ్మ, సీసీ గంగోజీ, నరసింహులు, గౌరీ, నారాయణ పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన ఉండాలి

చిత్తూరు రూరల్, జూన్ 26: మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన ఉండాలని, యువత వీటికి దూరంగా ఉండాలని పాస్ ఎన్‌జీవో సంస్థ ప్రతినిధులు కోరారు. సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌కే జూనియర్ కళాశాల నుంచి గాంధీ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కార్వేటినగరం : ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, కార్వేటినగరం ఎన్‌ఫోర్సుమెంట్ విభాగాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నగరి : డ్రగ్స్ వినియోగం ప్రమాదకరమని సీఐ సురేష్ అన్నారు. బుధవారం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

బంగారుపాళ్యం : డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేయాలని ఎస్ఈబీ సీఐ హరికృష్ణ అన్నారు. మండలంలోని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో బుధవారం డ్రగ్స్ వినియోగంతో వచ్చే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడండి

పాలసముద్రం, జూన్ 26: గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన వారితో సమావేశమయ్యారు. వర్షాలు కురుస్తుండడంతో వర్షపు నీరు తాగునీటి బోరు చుట్టూ చేరి కలుషితమయ్యే ప్రమాదముందని, అలాంటి ప్రదేశాలను గుర్తించి నిల్వ లేకుండా చూడాలని అన్నారు.

ఎంపీడీవోకు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటం



విజయపురం, జూన్ 26: ఎంపీడీవో కార్యాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్ర పటాలను ఏర్పాటు చేశారు. జనసేన జిల్లా కార్యదర్శి స్వామినాథన్ ఈ చిత్రపటాన్ని ఎంపీడీవో బ్రహ్మయ్యకు బుధవారం అందజేశారు. జనసేన నేతలు గోవర్ధన్, దేవదాస్, ఓంశంకర్, గుణ, ధర్మ, వేణు, దేవేంద్ర పాల్గొన్నారు.

పీఎం ఫొటో కూడా పెట్టాలి

గంగాధరనెల్లూరు, జూన్ 26: ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలతోపాటు సీఎం నరేంద్ర మోదీ ఫొటో కూడా పెట్టాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇడగట్టి సుధాకర్ కోరారు. ఈ విషయమై కూటమి నేతలు ఆలోచించాలని కోరారు.

గంగ జాతరలో ఎమ్మెల్యే భానుప్రకాష్



నగరి, జూన్ 26: చింతలపట్టెడ దళితవాడలో గురువారం నిర్వహించిన గంగజాతరలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు రమేష్‌బాబు, మండలాధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, నాయకులు గుణశేఖర్, ఉమాపతిరాజు, పోలవరం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

చంద్రబాబుకు ఔట్‌సోర్సింగ్ కార్మికుల విన్నపం



గుడిపాల, జూన్ 26: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ కోరారు. ఈ మేరకు బుధవారం కుప్పంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పీఆర్సీతో నష్టపోయామని, న్యాయం చేయాలని కోరారు.

కారును ఢీకొన్న బస్సు

ఇద్దరికి తీవ్ర గాయాలు



నుజ్జయిన కారు - గాయపడిన ఇక్బాల్

గుడిపాల, జూన్ 26: మండలంలోని బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిలోని ఎంసీఆర్ క్రాస్ సమీపంలో బుధవారం కారును బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వేలూరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కారును చిత్తూరు నుంచి వేలూరు వైపు వస్తున్న బస్సు ఎంసీఆర్ క్రాస్ వద్దనున్న భద్రకాళమ్మ గుడి సమీపంలో ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న బెంగళూరుకు చెందిన ఇక్బాల్, ఆలియా సాధన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వేలూరు సీఎంసీకి తరలించారు. గుడిపాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీరు మారని జగన్ : టీడీపీ

గుడిపాల, జూన్ 26 : మొన్నటి ఎన్నికల్లో ప్రజలు కోలుకోలేని దెబ్బ కొట్టినా మాజీ సీఎం జగన్ తీరులో ఏ మాత్రమూ మార్పు రాకపోవడం విచారకరమని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ విమర్శించారు. మాజీ సీఎం అనే గౌరవంతో అసెంబ్లీలో ప్రమాణస్వీకారానికి నాలుగో పేరుగా పిలిచిన స్పీకర్‌పై కక్షసాధింపు చర్య అని చెప్పడం సిగ్గుచేటన్నారు. తీరు మార్చుకోకపోతే రాజకీయాలకు పూర్తిగా దూరం కావాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

● సీఎంకు ఎమ్మెల్యే మురళీమోహన్ విన్నపం



ప్రద్యుమ్నకు నివేదిక ఇస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

యాదమరి, జూన్ 26: పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తొలి ప్రాధాన్యతగా యాదమరి రోడ్డును ఎంచుకున్నారు. కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు, ఆయన పర్సనల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్నలను కలిసి రోడ్డుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. టీడీపీ హయాంలో నగర శివారులోని ఇరువారం నుంచి జోడిచింతల వరకు 12 కిలోమీటర్ల దూరానికి రూ.16.80 కోట్లతో తొలి విడతగా తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. అక్కడ నుంచి తమిళనాడు రాష్ట్రం పరదరామి సరిహద్దు వరకు మరో ఎనిమిది కిలోమీటర్లు వేయాల్సి ఉంది. ఆ లోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు జరగలేదు. తదనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక రోడ్డు సంగతిని గాలికొదిలేసింది. తమిళనాడు రాష్ట్రం నుంచేగాక మండల కేంద్రం నుంచి వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతలమయం కావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోవడమేగాక కొందరు అంగవికలురయ్యారు. ఎమ్మెల్యే ఈ పరిస్థితిని సీఎం చంద్రబాబుకు వివరించారు. సీఎం సెక్రటరీకి రూ.10 కోట్లకు సంబంధించి నివేదికను అందించారు. జిల్లాపై ఆయనకు అవగాహన ఉండటంతో త్వరలోనే నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

చిన్నబండపల్లిలో ఇంటింటా వైద్య సేవలు

పూతలపట్టు, జూన్ 26: మండలంలోని చిన్నబండపల్లి గ్రామంలో బుధవారం వైద్యాధికారులు ఇంటింటా వైద్య సేవలు అందించారు. '30 మందికి అస్వస్థత... పట్టించుకోని అధికారులు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. స్పందించిన పూతలపట్టు వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి బాధితులను గుర్తించి, వైద్యసేవలు అందించారు. ఎంపీడీవో ప్రసన్నకుమారి తమ సిబ్బందితో వెళ్లి అంటురోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తాగునీటి శాంపిల్స్ తీసుకెళ్లారు.

అసెంబ్లీకి రాకుండా జగన్ కుంటి సాకులు : టీడీపీ

చిత్తూరు సిటీ, జూన్ 26: మాజీ సీఎం జగన్ అసెంబ్లీకి రాకుండా కుంటి సాకులు చెబుతున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ విమర్శించారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో టీడీపీకి కేవలం 23 మంది మాత్రమే సభ్యులున్నారని, అందులో ఐదుగురిని లాగేస్తే ప్రతిపక్ష హోదా కూడా మిగలదని నాటి సభలో జగన్ చెప్పింది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని అన్నారు. 18 మంది సభ్యులుంటే ప్రతిపక్ష హోదా ఉండదని చెప్పిన ఆయన ఇప్పుడు 11 మంది సభ్యులుంటే ప్రతిపక్ష హోదా కావాలని ఏ విధంగా అడుగుతున్నారని ప్రశ్నించారు. పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్య



శ్రీనివాసులురెడ్డి మృతదేహం

చిత్తూరు, జూన్ 26: ఒంటరి తనాన్ని భరించలేక నగరంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటవ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన శ్రీనివాసులురెడ్డి(60) దుస్తుల వ్యాపారం చేసేవాడు. నష్టాలు రావడంతో కుటుంబ కలహాలు మొదలై భార్యాపిల్లలు ఆయన్ను వదిలి వెళ్లిపోయారు. ఒంటరిగానే ఉంటున్నాడు. మంగళవారం స్థానికంగా ఉండే లాడ్జిలో రూము తీసుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లాడ్జి నిర్వాహకులు బుధవారం ఉదయం గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

బంగారుపాళ్యం, జూన్ 26: మండల కేంద్రంలోని చిట్టెమ్మ ఇంట్లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లో అద్దెకు ఉంటున్న రోహిత్ గదిలో టీవీ, ఫ్రిడ్జ్, ఫ్యాన్లు, బట్టలు, వంట సామగ్రి కాలిపోయాయి. రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

సచివాలయంలో తనిఖీలు

చిత్తూరు, జూన్ 26: దొడ్డిపల్లె మూడవ సచివాలయాన్ని కమిషనర్ అరుణ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టాఫ్ డయేరియా కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయండి

గంగాధరనెల్లూరు, జూన్ 26: గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను 15రోజులకొకసారి శుభ్రం చేయించాలని ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజు సర్పంచులను, కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని అగరమంగళంలో బుధవారం తాగునీటి ట్యాంక్ పరిసరాలను, సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్‌కు పరామర్శ

గంగాధరనెల్లూరు, జూన్ 26: ఆత్మహత్యకు ప్రయత్నించి, నగరి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయపురం మండలం కాళికాపురం పంచాయతీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్‌ను బుధవారం జిల్లా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ నేతలు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. యూనియన్ అధ్యక్షుడు అన్నామలై మాట్లాడుతూ ప్రభుత్వం మారడంతో రమేష్‌ను తొలగిస్తామని కొంతమంది నేతలు ప్రచారం చేయడం సరైన విధానం కాదన్నారు. ఇలాంటి ప్రచారాల వల్ల ఆత్మహత్యకు పాల్పడితే కుటుంబాలు వీధిన పడతాయని తెలిపారు.

పెంచిన పింఛను సహా

మండలానికి రూ.7.29కోట్లు విడుదల

గంగాధరనెల్లూరు, జూన్ 26: మండలంలో 11,127మందికిగాను రూ.7,29,96,500 పెన్షన్ నిధులు విడుదలయ్యాయి. రెండుమూడు నెలల పాటు పెన్షన్ తీసుకోని 118మందికి సైతం నిధులు విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలోని 11,009కి నెలకు రూ.3,14,82,000 నిధులు విడుదలయ్యేవి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరుతో పెంచిన పెన్షన్‌తో పాటు ఏప్రిల్, మే నెలలకు సంబంధించి రెండు వేలు అదనంగా కలిపి అందించనుంది. మండలంలో మొత్తం 25 సచివాలయాల పరిధిలో ఆ సిబ్బంది ద్వారా పెన్షన్ పంపిణీ జరుగుతుంది.

సూర్యప్రభపై కోదండరాముడి రాజసం



తవణంపల్లె, జూన్ 26: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై మేళతాళాల నడుమ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.

బంగారయ్య సేవలు అభినందనీయం

కార్వేటినగరం, జూన్ 26: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జూనియర్ అసిస్టెంట్‌గా బంగారయ్య సేవలు అభినందనీయమని ప్రిన్సిపాల్ స్వరూప పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం కళాశాల ఆవరణలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

ముగిసిన గుండాలమ్మ జాతర



చిత్తూరు కల్చరల్, జూన్ 26: నగరంలోని అశోక్‌పురం గుండాలమ్మ జాతర బుధవారం ముగిసింది. చివరి రోజు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. విశేష అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. వందలాది మంది భక్తులు వరపడి మొక్కులు తీర్చుకున్నారు. అశోక్‌పురం, చామంతిపురం, కొండమిట్టకు చెందిన మహిళలు అమ్మవారికి దీపారాధన చేశారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పూలరథంపై అధిష్ఠించి మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. జడ్పీ కార్యాలయం వద్ద ఓం శక్తి భక్తులు విన్యాసాలు చేస్తూ అమ్మవారికి పూలమాల వేసి జాతరను ముగించారు. గురువారం అమ్మవారికి వసంతోత్సవాలు నిర్వహించి, శాంతి మహోత్సవ పూజలు చేయనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు మురుగేషన్ తెలిపారు.



సీఎం చంద్రబాబుతో చిట్టిబాబు నాయుడు, అమరనాథనాయుడు



సీఎంకు కిరీటం బహూకరిస్తున్న నగరి నేతలు
పుష్పగుచ్ఛం ఇస్తున్న చెన్నకేశవుల నాయుడు



చంద్రబాబును కలిసిన నిండ్ర నేత దశరథవాసు